

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకులు

# అహర్నిశలు పనిచేస్తున్నాం..

- అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడుతున్నాం
- కులమతాలకు అతీతంగా సర్కారు పాలన
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 4 : ప్రజల కోసం పగలు రాత్రి అనే తేడాలేకుండా అహర్నిశలు పనిచేస్తున్నామని ఎక్సైజ్, క్రీడాశాఖల మంత్రి డాక్టర్ వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి సతీసమేతంగా హాజరుకాగా మున్నూరుకాపు సంఘం నాయకుల క్రేన్ సాయంతో భారీ గజమాలతో మంత్రి దంపతులను సత్కరించి, నాగలి బహూకరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ కులాలే వృత్తులుగా మారి నాగరిక సమాజానికి వ్యవసాయం పరిచయం చేశారన్నారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించేందుకు ఎంతో విలువైన భూములను కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఆత్మగౌరవ భవనాలలో ఏర్పాటు చేసిన కన్వెన్షన్ సెంటర్‌లో ఉచితంగా పెండ్లిళ్లు చేసుకొనేలా, విద్యార్థులకు వసతి గృహంతో పాటు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా అందరికీ న్యాయం చేసేలా పాలన సాగుతుందన్నారు. సమైక్య రాష్ట్రంలో ఎంతో వెనుకబాటుకు గురైన మహబూబ్‌నగర్‌లో ఒక్కప్పుడు భూముల విలువ రూ.లక్షల్లో ఉండేదని ఇప్పుడు కోట్లల్లో పెరిగిందని మంత్రి గుర్తు చేశారు. రాత్రి పగలు తేడాలేకుండా నియోజకవర్గం కోసం ఎంతో కష్టపడి పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. అంతకుముందు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ వద్దనున్న శివాలయం కొండ సమీపంలో రూ.3 కోట్లతో చేపట్టనున్న మున్నూరు కాపు కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మన్ వెంకటయ్య, రైతుబంధు సమితి డైరెక్టర్ లక్ష్మయ్య, ముడా డైరెక్టర్ బాలయ్య, మున్నూరుకాపు సంఘం నాయకులు పెంటయ్య, జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు వనజ, సంధ్యాశ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కేశవులు, సత్తి, నరేందర్‌తోపాటు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పాలమూరు అభివృద్ధే లక్ష్యం

మహబూబ్‌నగర్‌టౌన్, అక్టోబర్ 4 : మహబూబ్‌నగర్ పట్టణాభివృద్ధే తన ముందున్న లక్ష్యమని, సుందరపట్టణంగా తీర్చిదిద్దుతామని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి డాక్టర్ వీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని 44,28, 29,34,36,35,18,04,3,18,19, 40,41వ వార్డుల్లో రూ.17కోట్ల 70లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు సంబంధించి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అన్ని రంగాల్లో మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేశామన్నారు. స్వరాష్ట్రంలోనే అభివృద్ధి జరిగిందని, 70ఏండ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదేండ్లలో చేసి చూయించామని చెప్పారు. వార్డుల్లో మౌలిక వసతుల కల్పన కృషి చేశామని, ప్రతి వార్డులో పార్కులు అభివృద్ధి చేశామన్నారు. బైపాస్‌రోడ్డును గత పాలకులు టైమ్‌పాస్ చేశారని, మేము బైపాస్ అందుబాటులోకి తెచ్చామన్నారు. అప్పన్నపల్లి మొదటి బ్రిడ్డి నిర్మాణం గతంలో పాలకులు అసంపూర్తిగా వదిలేస్తే ఎమ్మెల్యేగా గెలిచిన కొన్ని నెలల్లోనే పూర్తి చేయించామని, రెండో బ్రిడ్జి నిర్మాణం కేవలం ఏడాదిలో పూర్తి చేశామన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చేప్పే నాయకులను నమ్మవద్దని, పని చేసే వారి అండగా ఉండాలని, అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ వైస్‌చైర్మన్ గణేశ్, కౌన్సిలర్లు వేదవ్రత్, పద్మ, మోయిన్‌అలీ, కిశోర్, నర్సింహులు, యాదమ్మ, నర్సింహ, ఫహీమ్‌సుల్తానా, షబ్బీర్ పాల్గొన్నారు.



మంత్రికి కిడ్డీ బ్యాంక్ అందజేసిన హరిప్రియ

### మంత్రికి కిడ్డీ బ్యాంక్ అందజేత

మహబూబ్‌నగర్‌టౌన్, అక్టోబర్ 4 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మోతీనగర్‌కు చెందిన ప్రభాకర్ కూతురు హరిప్రియ(4వ తరగతి) మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై అభిమానాన్ని చాటుకున్నది. బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మోతీనగర్ వచ్చిన మంత్రి కాన్వాయ్‌ను చూసి పలువురు చిన్నారులు మంత్రి వాహనాన్ని ఆపారు. చిన్నారులను చూసి మంత్రి తన వాహనాన్ని ఆపి కిందికి దిగారు. చిన్నారి హరిప్రియ పొదుపు చేసుకున్న కిడ్డీ బ్యాంక్‌ను తెచ్చి మం త్రికి ఇచ్చి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవసరమైన ఖర్చుల కోసం తనవంతు సా యంగా అందిస్తున్నట్లు చెప్పింది. దీంతో చిన్నారి హరిప్రియ తనపై చూపుతున్న అభిమానానికి మంత్రి ఫిదా అయ్యారు.

### తెలంగాణ బిడ్డ మొల్లమాంబ..

పాలమూరు, అక్టోబర్ 4 : మన ప్రాంత ప్రజలకు తెలియని తెలంగాణ జాతి బిడ్డ మొల్లమాంబ అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పద్మావతి గ్రీన్ బెల్ట్‌లో ఏర్పాటు చేసిన మొల్లమాంబ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాముడు, సీత, లక్ష్మణుడు గురించి అందరికీ అర్థమయ్యేలా తెలుగులో అనువాదం చేసిన మొదటి వ్యక్తి మొల్లమాంబ అని మంత్రి పేర్కొన్నారు. కుమ్మరి వృత్తి జాతికి నాగరికతను పరిచయం చేశారన్నారు. గతంలో ప్రభుత్వాలు కుమ్మరులను పట్టించుకోలేదని ఇప్పుడు ఆ వృత్తికి పూర్వవైభవం తీసుకొచ్చామన్నారు. జిల్లా కేంద్రంలో శాలివాహన కమ్యూనిటీ భవనానికి 2వేల గజాల స్థలం, రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, కోశాధికారి రవిశేఖర్ తదితరులు ఉన్నారు.

# రైతులకు సాగునీరందించడమే లక్ష్యం

- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- రూ.31.60 కోట్లతో హైలెవల్ కెనాల్ పనులకు శంకుస్థాపన
- దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం : ఎమ్మెల్యే బీరం
- ఘనంగా మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి జన్మదినం

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 4 : వ్యవసాయ రంగానికి శాశ్వతంగా సాగునీరందించడమే లక్ష్యంగా పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తుందని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం రూ. 31.60కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బాచారం హైలెవల్ కెనాల్ పనులకు యాపట్ల వద్ద ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి మండలంలో చాలా కాలంగా రైతాంగం ఎదుర్కొంటున్న మూడు ప్రధాన పనుల్లో ఒకటి బాచా రం హైలెవల్ కెనాల్‌కు రూ.31.60 కోట్ల వ్యయంతో పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. అనేక సంత్సరాలుగా ప్రధానంగా రైతాం గం, ప్రజలు ఏడు, ఎనిమిది గ్రామాలకు సాగునీరు లేక కృష్ణానది ఆమడదూరంలో ఉన్న సాగునీటికి రైతాంగం నోచుకోకపోవడం విషయాన్ని ఎమ్మెల్యే బీరం ముఖ్యమంత్రి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారన్నారు. కొన్ని సందర్భాల్లో తాను కూడా సీఎం కేసీఆర్‌కు వివరించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక కృషితో ఇవాళ బాచారం హైలెవల్ కెనాల్‌కు సీఎం కేసీఆర్ అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. 5,900 ఎకరాలు, 8గ్రామాలు, రూ.31.60కోట్లతో అంచనా వ్యయంతో ఆ పనులకు ఇవాళ శ్రీకారం చుట్టినట్లు మంత్రి వెల్లడించారు. దీనికి సంబంధించిన వెంటనే భూసేకరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించామని, సర్వే అనంతరం పనులు ప్రారంభమవుతాయని మంత్రి వివరించారు. అదే విధంగా నాయినోనిపల్లి మైసమ్మ ఆలయానికి ఉమ్మడి పాలమూరు నుంచే కాకుండా కర్ణాటక, ఏపీ తదితర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా రూ.5 కోట్లు మంజూరు చేయడంతో వాటితో భక్తుల కోసం ప్రత్యేక మండపాన్ని నిర్మించుకొని ఇవాళ ప్రారంభించుకున్నామన్నారు. భవిష్యత్‌లో ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చి దిద్దుకొని అన్ని వసతులు కల్పించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

### దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం : బీరం

ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పెద్దకొత్తపల్లి మండలంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాం. మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మంజూరు చేస్తూ ఈరోజే ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. గతంలో ఎన్నో అవకాశాలున్న గతంలో ఉన్న నాయకుడు తన స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చాడని మాజీ మంత్రి జూపల్లిని ఉద్దేశించి ఆరోపించారు. ఈరోజు ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి అడిగిన వెంటనే అన్ని అభివృద్ధి పనులను మంజూరు చేస్తూ కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్నారని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పెద్దకొత్తపల్లి ఎంపీపీ భోజ్యానాయక్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీ సింగారం వెంకటయ్యయాదవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు గణేశ్‌రావు, రాంచందర్‌యాదవ్, రాజశేఖర్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాచారం హైలెవల్ కెనాల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి,ఎమ్మెల్యే బీరం

### చివరి ఆయకట్టుకు నీళ్లందిస్తాం..

కోడేరు, అక్టోబర్ 4 : ఎంజీకేఎల్ఐ పసుపుల–పాన్‌గల్ బ్రాంచి కెనాల్ ద్వారా చివరి ఆయకట్టు రైతాంగానికి సాగునీరు అందిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అందిస్తామన్నారు. బుధవారం సాయంత్రం కోడేరు శివారులో ఉన్న పసుపుల–పాన్‌గల్ బ్రాంచ్ కెనాల్ సిమెంట్ లైనింగ్ పనులకు కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో నిర్మించిన పసుపుల పాన్‌గల్ బ్రాంచి కాల్వ ద్వా రా చివరి ఆయకట్టు రైతుల పొలాలకు సాగు నీళ్లు వెళ్లడం లేదని దీంతో రైతులు పొలాలకు నీళ్లు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు సమస్యలను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా కొల్లాపూర్ సభలో రైతులకు ఇచ్చిన మాటప్రకారం బ్రాంచి కాల్వ సిమెంట్ లైనింగ్ పనులకు అవసరమైన నిధులను మంజూరు చేశారన్నారు. ఇప్పటికే మంజూరైన రూ.60 కోట్ల నిధులతోపాటు అదనంగా మరో 30శాతం నిధులను పెంచే అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం బ్రాంచి కాల్వ వద్దలో మంత్రి, ఎమ్మెల్యే బీరం కృష్ణా జలాలకు పూలు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, విండో డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు జగదీశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, ఇంజినీరింగ్ అధికారులు, నాయకులు పాల్గొనారు.

### నా జీవితం ప్రజాసేవకే అంకితం

వనపర్తి, అక్టోబర్ 4 : ఈ జీవితం ప్రజాసేవకే అంకితమని, తనను గెలిపించిన ప్రజలకు తనలో శ్వాస ఉన్నంత వరకు వారికి సేవలందిస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి 65వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పెద్దఎత్తున తరలివచ్చి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తనకోసం వ్యయ ప్రయాసాల కోర్చి జన్మదిన శుభాకాంక్షాలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రధానంగా మలి దశ ఉద్యమం నుంచి కేసీఆర్ వెన్నటి నడిచానన్నారు. సాధించుకున్న తెలంగాణలోని ప్రజల బతుకులు, ఎడారైన ఈ నెలను ఎలా పచ్చపర్చాలో అనే ఆలోచనలతో నా రాజకీయం జీవనం సాగిందన్నారు. ఆ ఆలోచనకు కేసీఆర్ అన్నింటా తాను వెనుక ఉండి నన్ను ముందుకు నడిపి నేడు నా నియోజకవర్గంలోని ప్రతి పల్లెను పచ్చగా చేసిండన్నారు. ఆయన చలువతోనే నేడు అనేక రిజర్వాయర్లు, చెక్ డ్యాంలు, మినీ లిఫ్టులు ఏర్పాటు చేసుకొని కోనసీమగా చేసుకున్నామన్నారు. అదేవిధంగా జిల్లాను విద్యా,ఆరోగ్యంలోనూ ముందుంచాలన్న తపనతో జిల్లాకు మెడికల్, నర్సింగ్, వ్యవసాయ, ఇంజినీరింగ్, మత్స్య కళాశాలలను తీసుకొచ్చామన్నారు. మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 8 మంది దివ్యాంగులకు సింగిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా స్కూటీలను మంత్రి అందజేశారు. అంతకుముందు క్యాంప్ కార్యాలయంలో 70 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ తో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

# స్వరాష్ట్రంలోనే మహిళా సాధికారత : ఎమ్మెల్యే ఎస్‌ఆర్‌రెడ్డి



పేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మహిళలు

నారాయణపేట, అక్టోబర్ 4 : తెలంగాణ ఏర్పాటయ్యాకే మహిళల సాధికారత సాధ్యమైందని ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణలో మహిళలు ఆర్థిక పరమైన వైరుధ్యాల నుంచి బయటపడి సొంత కాళ్లపై నిలబడుతున్నారన్నారు. మహిళలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. మహిళా సంఘాల వారి కోసం పరిశ్రమ నెలకొల్పేలా కృషి చేస్తామన్నారు. అనంతరం మహిళా సంఘాల నాయకులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని పూలమాల, శాలువాతో సన్మానించారు. ఆర్పీల వేతనాలు పెంచినందుకు గానూ సీఎం కేసీఆర్, ఎమ్మె ల్యే చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అ నసూయ, వైస్‌చైర్మన్ హరినారాయణ భట్టడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, కౌన్సిలర్లు రాజేశ్వరీ, శిరీష, మేఘా కులకర్ణితోపాటు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.